# ఆశ్రమ పాఠశాల గాలికి..

- మెనూ ఉండదు, టీచర్లు ఉండరు
- బాత్ రూంకు వెళ్లాలంటే గోడ దూకాల్సిందే..
- పట్టించుకోని హెచ్ఎం, పాఠశాల సిబ్బంది
- పాఠశాలలో మూలుగుతున్న సమస్యలు.. పట్టని సిబ్బంది
- ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు రామ్ చరణ్, సాయి



శామ్, ఏప్రిల్04(కెరటం ప్రతినిధి)

ఆ పాఠశాలలో ఒకటి దాటితే టీచర్లే కాదు కనీసం వాచ్‌మెన్ కూడా అందుబాటులో ఉండరు. పిల్లలకు సరైన మెను ప్రకారం ఆహారం అందించే నాథుడే లేరు.. ఇక్కడ విద్యార్థులు బాత్ రూంకు వెళ్లాలంటే గోడ దూకాల్సిన దుస్థితి దాపురించిందని ఎస్ఎఫ్ఐ నేతలు వాపోతున్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా స్థానిక అశ్వరావుపేట మండలం సున్నంబట్టి ఆశ్రమ పాఠశాల ప్రాంతంలో ఉన్నటువంటి పివి ప్రాజెక్ట్ ఆశ్రమ పాఠశాలను ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు సిహెచ్ రామ్ చరణ్, బొదెబోయిన సాయి శుక్రవారం సందర్శించారు. దీనిలో భాగంగా ఆశ్రమ పాఠశాలలో మూలుగుతున్న సమస్యలను వెలికి తీశారు.

ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ నాయకులు రామ్ చరణ్, సాయి మాట్లాడుతూ.. స్థానిక హెచ్ఎం, టీచర్లు, వర్కర్లు, వాచ్మెన్ ఎవరూ లేకుండా విద్యార్థులను పట్టించుకోకుండా భోజనం మెనూ ప్రకారం లేకుండా నామమాత్రం పెట్టి ఆడుకోమని ఆశ్రమ పాఠశాలను మధ్యాహ్నం ఒకటి దాటితే గాలికి వదిలేస్తున్నారు అన్నారు. పిల్లలకు అందిస్తున్న ఆహారం కూడా మెనూ ప్రకారం అందించడం లేదన్నారు. విద్యార్థులకు వాష్ రూమ్స్ కూడా వాడటానికి అనుగుణంగా లేవన్నారు. టాయిలెట్ వాష్ రూమ్ లకు వెళ్లాలంటే డబ్బా పట్టుకొని పిల్లలు వెనక నుండి ఆశ్రమ పాఠశాల గోడ దూకి వెళ్తున్నారన్నారు. అడగడానికి సదరు ప్రధానోపాధ్యాయులు, వార్డెన్, ఉపాధ్యాయ సిబ్బంది, వర్కర్లు, కనీసం వాచ్మెన్ కూడా మధ్యాహ్నం 1 దాటితే అందుబాటులో ఉండడం లేదన్నారు. ఏ ఉపాధ్యాయులు కూడా కోటర్స్‌లో ఉండడం లేదన్నారు.

విద్యార్థులను మధ్యాహ్నం సమయంలో మండుటెండలో గ్రౌండ్ లోను, ఆశ్రమ పాఠశాల ప్రాంగణంలో పిల్లలు ఇష్టానుసారంగా బయట తిరుగుతూ గొడవలు పడుతున్నారన్నారు. కనీసం వాచ్మెన్ కూడా కాపలాకి ఉండకపోవడం చాలా దుర్మార్గం అన్నారు. కావున ప్రధానోపాధ్యాయులు, సదరు నిర్వహణ సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆశ్రమ పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

## సర్వజ్ఞలో చిన్నారుల చేతుల్లో కళా సౌందర్యం

# మెహందీ ఉత్సవ్

ఖమ్మం టౌన్, కెరటం న్యూస్

ఖమ్మం విడీఓస్ కాలనీ నందు సర్వజ్ఞ పాఠశాలలో శనివారం చిన్నారుల కోసం మెహందీ ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన ప్రత్యేక స్టాల్స్లో బాలికలు ఒకరి చేతికి ఒకరు అందమైన మెహందీ డిజైన్లను వేసుకున్నారు. వివిధ రకాల సంప్రదాయ, ఆధునిక డిజైన్లతో చిన్నారుల చేతులు కళకళలాడాయి. ఈ వేడుకల్లో ఉపాధ్యాయులు కూడా చిన్నారులకు మెహందీ వేయడంలో సహాయపడ్డారు. విద్యార్థులు తమకు ఇష్టమైన డిజైన్లను ఎంచుకొని, వాటిని తమ చేతులపై వేసుకుని ఆనందంగా గడిపారు.

ఈ సందర్భంగా పాఠశాల చైర్మెన్ ఆర్.వి. నాగేంద్ర కుమార్ గారు మాట్లాడుతూ, "విద్యార్థులలో కేవలం విద్యాపరమైన నైపుణ్యాలను మాత్రమే కాకుండా, వారిలో దాగి ఉన్న కళాత్మక ప్రతిభను వెలికి తీయడం మా లక్ష్యం. మెహందీ ఉత్సవాలు వంటి కార్యక్రమాలు పిల్లలలో సృజనాత్మకతను, సాంస్కృతిక అవగాహనను పెంపొందిస్తాయి. మన సంస్కృతి, సంప్రదాయాలను గౌరవిస్తూ, వాటిని భవిష్యత్ తరాలకు అందించాల్సిన బాధ్యత మనందరిపై ఉంది" అని పేర్కొన్నారు. ఈ మాసంలో గోరింటాకు పెట్టుకోవడం కేవలం ఒక సంప్రదాయం మాత్రమే కాదు, దీని వెనుక ఎన్నో ఆరోగ్య, సామాజిక ప్రయోజనాలు కూడా




ఉన్నాయి. తెలుగు సంస్కృతిలో గోరింటాకు ఆషాఢ మాసం లో ఒక ముఖ్యమైన భాగం. గోరింటాకును శుభానికి, సౌభాగ్యానికి ప్రతీకగా భావిస్తారు. ఆరోగ్య ప్రయోజనాలు శరీర ఉష్ణోగ్రత నియంత్రణ, నరాల ఉపశమనం, రక్త ప్రసరణ మెరుగుదల అనేక రకాల వ్యాధులను నియంత్రిస్తుందని తెలిపారు. పాఠశాల కరెస్పాండెంట్ నీలిమగారు మాట్లాడుతూ, "విద్యార్థులు పాఠశాలలో నేర్చుకునే ప్రతి అంశం వారి భవిష్యత్తుకు పునాది కావాలి. ఈ మెహందీ వేడుకలు పిల్లలకు ఆనందాన్ని ఇవ్వడమే కాకుండా, వారిలో సహకారం, సృజనాత్మకత, సామాజిక ఐక్యత వంటి విలువలను పెంపొందిస్తాయి. ప్రతి విద్యార్థి తమ బాల్యాన్ని ఆనందంగా గడపడంతో పాటు, నూతన విషయాలను నేర్చుకోవాలని కోరుకుంటున్నాము" అని తెలిపారు. విద్యార్థులు భవిష్యత్తులో ఉత్తమ పౌరులుగా ఎదగాలని ఆకాంక్షించారు. మెహందీ ఉత్సవాలు విజయవంతంగా ముగిశాయి. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు మరియు పాఠశాల సిబ్బంది ఉల్లాసంగా ఉత్సాహంగా పాల్గొన్నారు.



## అంగన్‌వాడీ కేంద్రానికి కుర్చీలు వితరణ

- టీం సంభవ ఫౌండేషన్ హైదరాబాద్ సహకారంతో అందజేత

శామ్, ఏప్రిల్04(కెరటం ప్రతినిధి)

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా లక్ష్మీదేవిపల్లి మండల పరిధిలోని గట్టుమల్ల పంచాయతీలో గల గంగమ్మ కాలనీ అంగన్వాడి కేంద్రము నకు టీం సంభవ ఫౌండేషన్ హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో నదీమ్, యాసిన్ వారి ఆర్థిక సహకారంతో రంజాన్ పండగను సందర్భంగా 30 కూర్చిలను అందజేశారు. ఈ కుర్చీలను ప్రాజెక్టు సిడిపిఓ లక్ష్మీ ప్రసన్న చేతులమీదుగా అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా లక్ష్మీ ప్రసన్న మాట్లాడుతూ అంగన్వాడీ సెంటర్లో పిల్లలకు గర్భిణీలకు బాలింతలకు పౌష్టిక ఆహారం అందించే విధంగా అంగన్వాడీ కేంద్రాలు అభివృద్ధి చెందుతున్నాయి అన్నారు. అంగన్వాడీ కేంద్రాలకు కుర్చీలను వితరణ అందించిన టీం సంభవ ఫౌండేషన్ హైదరాబాద్ వారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ వాలంటీర్ సెక్టార్ సూపర్వైజర్ శారద, అంగన్వాడీ టీచర్ జ్యోతి, ఏఎల్ఎంఎస్‌సి కమిటీ సభ్యులు, పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.





## ఆటో డ్రైవర్ల పొట్టకొట్టొద్దు...

- కొత్తగూడెంలో ఉబర్, ఓలా, రాపిడోలను తక్షణమే నిషేధించాలి
- ఈ నెల 8న ఆటోలతో భారీ నిరసన ర్యాలీ
- ఆటో వర్కర్స్ యూనియన్ నాయకులు ప్రకటన

శామ్, ఏప్రిల్04(కెరటం ప్రతినిధి)

ఆటో డ్రైవర్ల జీవనంపై పెను ప్రమాదం సృష్టిస్తున్న ప్రైవేటు టాక్సీ సంస్థలైన ఉబర్, ఓలా, రాపిడోలను తక్షణమే కొత్తగూడెంలో నిషేధించాలంటూ కొత్తగూడెంలోని ఆటో వర్కర్స్ యూనియన్ అన్ని అడ్డాల అధ్యక్షులు సమావేశం ఏర్పాటు చేయడమైనది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర అధ్యక్షులు కంచర్ల జమలయ్య, కార్యదర్శి బత్తుల సత్యనారాయణ, జిల్లా ప్రధాన కార్యదర్శి మర్రి కృష్ణ హాజరయ్యారు. రాపిడ్ లాంటి ప్రైవేట్ సంస్థలను రద్దు చేయాలని డిమాండ్ ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లాలంటే వందలాదిమంది ఆటో సోదరులతో కొత్తగూడెం పట్టణంలో భారీ ర్యాలీ తీయాల్సిన అవసరం ఉంది అని అధ్యక్షుల సమక్షంలో రాష్ట్ర అధ్యక్షులు తెలియపరిచారు. ఈ భారీ ర్యాలీ 8వ తారీకు మంగళవారం నాడు స్థానిక పోస్ట్ ఆఫీస్ సెంటర్ నుంచి ఆర్డిఓ ఆఫీస్ వరకు ర్యాలీ జరపాల్సి ఉంటుంది అని తెలిపారు. ఈ కార్యక్రమంలో కొత్తగూడెంలోని అన్ని అడ్డాల అధ్యక్షులు పాల్గొని ఈ సమావేశాన్ని విజయవంతం చేశారు.

